సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 13 । జూన్ । 2025



మొక్కలు నాటాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఖాళీ స్థలాల్లో ఆకుకూరలు, తీగజాతి మొక్కలు నాటాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. నేరెళ్లలో గురువారం అంగన్‌వాడీ బాటలో పాల్గొన్నారు.



వేదపాఠశాలలో యోగా పాఠాలు

వేములవాడ: స్థానిక వేద పాఠశాల విద్యార్థులకు గురువారం యోగా పాఠాలు బోధించారు. శిక్షకులు ఎలిగేటి కృష్ణ, అధికారులు శశిప్రభ, తిరుపతి, రిషిక తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం పడే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

14న జాతీయ మెగా లోక్ అదాలత్



సిరిసిల్లకల్చరల్: ఈనెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ తెలిపారు. రాజీతో పరిష్కరించుకోదగిన కేసుల విషయంలో కక్షిదారులు సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. వీలైనన్నీ ఎక్కువ కేసులు అదాలత్‌లో పరిష్కారమయ్యేలా సహకరించాలని న్యాయవాదులను కోరారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా 'తుమ్మల'

- 'అడ్లూరి'కి నల్గొండ జిల్లా బాధ్యతలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్థానంలో తుమ్మల నాగేశ్వరరావును నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ల ఇన్‌చార్జీ బాధ్యతల్లో ఎలాంటి మార్పు జరగలేదు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా శ్రీధర్‌బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రిగా పొన్నం ప్రభాకర్‌లను కొనసాగించారు. ఇటీవల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రిగా నియమించారు.

కేంద్ర పథకాలతోనే రాష్ట్రంలో అభివృద్ధి



సిరిసిల్లఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్లపాటు బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తుందన్నారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క గిరిజ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి దేవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన స్కూల్ పునఃప్రారంభం



ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలో నాలుగేళ్ల క్రితం మూతపడ్డ ఎర్రనర్సుపల్లి ప్రాథమిక పాఠశాల గురువారం పునర్‌ప్రారంభమైంది. ఐదుగురు విద్యార్థులు పాఠశాలకు వచ్చినట్లు ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్ తెలిపారు. 2021లో మూతపడిన స్కూల్ తిరిగి ప్రారంభించడంపై పల్లె ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎర్రనర్సుపల్లి స్కూల్ మూతపడ్డ విషయాన్ని గతంలో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్ బుధవారం స్కూల్‌ను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడడంతో పిల్లలను చేర్పించారు.

సినారెకు నివాళి



సిరిసిల్లకల్చరల్/వేములవాడ: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా జిల్లా కవులు నివాళి అర్పించారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ భవనంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

కవి సమ్మేళనం

వేములవాడలో కవితాభారతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సినారె సాహిత్యం, సినీ గేయరచనలపై కవితలు వినిపించారు. కవులు జి.నర్సన్, రిటైర్డ్ లెక్చరర్లు ఆడెపు నారాయణ, వీరగోని ఆంజనేయులు, గూడూరి బాలరాజు, అంకారపు రవి, బూర దేవానందం, అద్దెంకి రాజు ఉన్నారు.

పెద్దబడి.. మేధావుల ఒడి

- సైంటిస్ట్‌లు.. డాక్టర్లు.. ఇంజినీర్ల పుట్టినిల్లు
- అసౌకర్యాలనూ అధిగమించి ఉన్నత స్థానాలకు..
- ఆనాటి విద్యార్థులు.. నేడు ఆదర్శప్రాయులు
- జ్ఞాన పరిమళాలు వెదజల్లుతున్న ఎల్లారెడ్డిపేట హైస్కూల్



ఎల్లారెడ్డిపేటలోని నాటి పెద్దబడి భవనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఊరు నడిబొడ్డున ఠీవీగా నిల్చొని జ్ఞానపరిమళాలు వెదజల్లుతోంది ఎల్లారెడ్డిపేట పెద్దబడి. నిజాం కాలంలో ప్రారంభించిన ఈ విద్యాలయం ఎందరో మేధావులకు పుట్టినిల్లు. ఇక్కడ ఓనమాలు దిద్దిన వారు.. నేడు సమాజాభివృద్ధిలో తమ అక్షరాలను వెదజల్లుతున్నారు. అల్లరి పిల్లలుగా అడుగుపెట్టి.. అక్షర యోధులుగా బయటకు వెళ్లి.. పెద్దబడి పేరు నిలబెట్టేలా ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎందరో సైంటిస్ట్‌లు.. డాక్టర్లు..ఇంజినీర్లు.. కవులు.. పోలీసులుగా రాష్ట్ర, దేశస్థాయిలో కీర్తి గడిస్తున్నారు. ఆనాటి అసౌకర్యాలను మెట్లుగా చేసుకొని అందరూ గర్వపడేలా ఎదిగిన వారు ఈనాటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎల్లారెడ్డిపేట పెద్దబడి(హైస్కూల్)లో చదువుకున్న ఎందరో ఉపాధ్యాయులుగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్నారు. పెద్దబడి విశిష్టతపై ప్రత్యేక కథనం..



ఎల్లారెడ్డిపేటలోని హైస్కూల్

పెద్దబడి నుంచి కేంద్ర సాహిత్య అకాడమీ వరకు..



నలిమెల భాస్కర్

ఎల్లారెడ్డిపేట పెద్దబడిలో అక్షరాలు దిద్దిన నలిమెల భాస్కర్ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకునే వరకు ఎదిగారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. కామారెడ్డిలో ఇంటర్, డిగ్రీ చదివారు. మొదట ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన భాస్కర్ తర్వాత లెక్చరర్‌గా ఎంపికయ్యారు. కరీంనగర్ ఎస్సారార్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండగానే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. 14 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన భాస్కర్ ఎన్నో పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. మళయాళం అనువాద కవిత స్మారక శిలలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కాళోజీ పురస్కారం స్వీకరించారు. పెద్దబడిలో ఆనాటి పరిస్థితులు అధిగమించి చదువుకున్న తాము ఈ స్థాయికి ఎదగడానికి తమ గురువుల బోధనలేనని నలిమెల భాస్కర్ గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులు చేరి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఫస్ట్ ఇంజినీర్.. శాస్త్రవేత్త



వేముల మనోహర్

ఎల్లారెడ్డిపేటకు చెందిన వేముల మనోహర్ పెద్దబడిలోనే విద్యాభ్యాసం పూర్తి చేసి.. దేశం గర్వించే శాస్త్రవేత్తగా ఎదిగారు. 1981–82లో పదోతరగతి పూర్తి చేశారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీర్ పట్టా అందుకున్నారు. ఎల్లారెడ్డిపేట నుంచి ఇంజినీరింగ్ చదివిన వారిలో మొదటి వారు మనోహర్ మాత్రమే. మద్రాస్ ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ మిసైల్ కాంప్లెక్స్‌లో డీఆర్‌డీఎల్(డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ల్యాబరేటరీస్) సైంటిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ ప్రాంతబిడ్డ కలెక్టర్..



కేవీ రమణాచారి

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన కేవీ రమణాచారి మండల కేంద్రంలోని పెద్దబడిలో చదువుకొని దేశంలోనే అత్యున్నత ఉద్యోగం కలెక్టర్‌గా ఎంపికయ్యారు. కలెక్టర్‌గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ శాఖలతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఈవోగా తనదైన ముద్ర వేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వ సలహాదారుగా మాజీ సీఎం కేసీఆర్ వద్ద తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఎల్లారెడ్డిపేట పెద్దబడిలో చదువుకొని కలెక్టర్‌గా ఎదిగిన రమమణాచారి ఈ ప్రాంతంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఎంతో మంది ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదిగారు.

నాటి విద్యార్థి.. నేటి ఎస్పీ



భూక్య రాంరెడ్డి

ప్రస్తుత వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన భూక్య రాంరెడ్డి ఎల్లారెడ్డిపేటలోని పెద్దబడిలో చదువుకొని ఎస్పీ స్థాయికి ఎదిగారు. రాంరెడ్డి మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక పెద్దబడి(హైస్కూల్)లో చదువుకున్నారు. 1981–82లో పదో తరగతి చదివిన రాంరెడ్డి ఇంటర్ నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జేసీలో, డిగ్రీ కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీలో చదివారు. 1989లో ఎస్సైగా ఎంపికయ్యారు. సీఐగా ఏడూర్లబయ్యారం, ఆదిలాబాద్, డీఎస్పీగా డీటీసీ వరంగల్, వైరా, పీటీసీ కరీంనగర్‌లో పనిచేశారు. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది సీఐడీ వరంగల్‌లో పనిచేశారు. 2024, ఆగస్టు 14న ఎస్పీగా పదోన్నతి పొంది హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే లంబాడాలలో ఎస్పీగా ఎదిగిన తొలి వ్యక్తి రాంరెడ్డి కావడం గమనార్హం. ఎల్లారెడ్డిపేట పెద్దబడిలో చదివిన రాంరెడ్డి ఎస్పీ స్థాయికి ఎదిగి నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

దేశం గర్వించే స్థాయికి ఎదిగారు



ఎల్లారెడ్డిపేట హైస్కూల్‌లో చదువుకున్న వారు ఎందరో దేశం గర్వించే స్థాయికి ఎదిగారు. వారంతా సమాజ శ్రేయస్సు కోసం తమ జ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఐఏఎస్‌లుగా, సైంటిస్ట్‌లుగా, ఇంజినీర్లుగా, పోలీసులుగా సేవలందిస్తున్నారు. ఈ బడిలో చదువుకున్న పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి. పెద్దబడిలో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలి. కార్పొరేట్ స్కూళ్లకు మించి ఇక్కడ వసతులు ఉన్నాయి. విద్యాబోధన కూడా అంతకుమించి ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పెద్దబడిలో చేర్పించండి. వారిని మేము ఉన్నతంగా తీర్చిదిద్దుతాం.

– మనోహరాచారి, హెచ్‌ఎం, ఎల్లారెడ్డిపేట పెద్దబడి

విద్యతో ఆర్థిక అసమానతలు దూరం



గీతానగర్ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్ అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల: విద్యతోనే సమాజంలో ఆర్థిక అసమానతలు దూరమవుతాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట'లో భాగంగా సిరిసిల్ల పట్టణం గీతానగర్ జెడ్పీ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. డాక్టర్, ఇంజినీర్, లాయర్ ఇతర ఉన్నత ఉద్యోగాలు, తాము ఎంచుకున్న రంగమే లక్ష్యంగా చదవాలని సూచించారు. విద్యార్థులు పుస్తకాలలోని ప్రతీ అంశంపై లోతుగా అధ్యయనం చేయాలన్నారు. పాఠ్యాంశాలలోని అనుమానాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. ఈ పాఠశాలలోని విద్యార్థులకు అన్ అకాడమీ ద్వారా ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు శిక్షణ అందించే ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపారెడ్డి, జిల్లా విద్యాధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా గురువారం ఆవిష్కరించారు. ఈనెల 19న కలెక్టరేట్‌లో అధికారులతో యోగా కార్యక్రమం నిర్వహణకు కలెక్టర్ అనుమతించారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శశిప్రభ, సహాయ నోడల్ అధికారులు డాక్టర్ సౌమిని, డాక్టర్ శ్వేత, డీపీఎం తిరుపతి, యోగా శిక్షకులు బొల్లాజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజన్న కోడెల పంపిణీ

వేములవాడఅర్బన్: తిప్పాపూర్ గోశాలలోని రాజన్న కోడెలను శుక్రవారం రైతులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులు ధ్రువీకరణపత్రాలతో రావాలని సూచించారు. అర్హులకు మాత్రమే జియో ట్యాగింగ్ గల కోడెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని సూచించారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు

- ఎంవీఐ వంశీధర్



ముస్తాబాద్‌లో బస్సులు పరిశీలిస్తున్న ఎంవీఐ

ముస్తాబాద్(సిరిసిల్ల): మోటారు వాహనాల చట్టం నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల ఎంవీఐ వంశీధర్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలంలో ప్రైవేటు పాఠశాలల స్కూల్ బస్సులను గురువారం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న ఓ పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం స్కూల్ యాజమాన్యాలు నడచుకోవాలని సూచించారు. సహాయక ఎంవీఐ రజనీ, కానిస్టేబుళ్లు సౌమ్య, ప్రశాంత్, రమ్య పాల్గొన్నారు.

ముసురు వాన

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా గురువారం ముసురు వానలు కురిశాయి. కోనరావుపేటలో అత్యధికంగా 8.7 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 0.7, చందుర్తిలో 5.0, వేములవాడ రూరల్‌లో 4.5, బోయినపల్లిలో 8.0, వేములవాడలో 7.2, సిరిసిల్లలో 3.9, వీర్నపల్లిలో 3.1, ఎల్లారెడ్డిపేటలో 1.7, గంభీరావుపేటలో 0.5, ముస్తాబాద్‌లో 2.5, తంగళ్లపల్లిలో 0.5, ఇల్లంతకుంటలో 1.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

గుడ్ మార్నింగ్ టీచర్



గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

గుడ్‌మార్నింగ్.. ఇది అందమైన మార్నింగ్.. అంటూ పిల్లలు గురువారం ఉదయం బడిబాట పట్టారు. దాదాపు రెండు నెలల వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యాయి. తొలి రోజు పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు తమ స్నేహితులను పలకరిస్తూ.. టీచర్లకు గుడ్‌మార్నింగ్ చెబుతూ చలాకీగా తరగతిగదుల్లోకి వెళ్లడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల



టీచర్‌కు నమస్కారం చేస్తున్న విద్యార్థులు

డంపుయార్డులో మంటలు పునరావృతం కానివ్వం

- విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేస్తాం
- మున్సిపల్ కమిషనర్ వాణి

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: జిల్లా కేంద్రం శివారులోని మున్సిపల్ డంపుయార్డులో మంటలు పునరావృతం కానివ్వబోమని మున్సిపల్ కమిషనర్ పోసు వాణి గురువారం స్పష్టం చేశారు. డంపుయార్డులో చెలరేగుతున్న మంటలపై 'పచ్చని గుట్టల్లో 'చెత్త' మంటలు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. తడి చెత్తతో కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నామని, పొడి చెత్తను వేరు చేసి మెప్మా మహిళా సంఘాల ద్వారా రీసైక్లింగ్ చేస్తున్నామని వివరించారు. డంపుయార్డులోని చెత్తలో లభించే రాగితీగల కోసం గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో మంటలు పెడుతున్నారని, ఎండల తీవ్రతతో కొన్నిసార్లు ఆ మంటలు చెలరేగుతున్నాయని తెలిపారు. మంటలను గమనించిన వెంటనే అగ్నిమాపక కేంద్రం అధికారుల సహకారంతో ఆర్పివేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పొడిచెత్తతో విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


పచ్చనిగుట్టల్లో 'చెత్త' మంటలు

'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనం.

నేతన్నలకు వరం త్రిఫ్ట్

- చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు రాఘవరావు



జి.రాఘవరావు

సిరిసిల్ల: తెలంగాణ ప్రభుత్వం మరమగ్గాల కార్మికులకు తెలంగాణ నేతన్న పొదుపు(త్రిఫ్ట్ ఫండ్) పథకాన్ని ప్రారంభించిందని జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు జి.రాఘవరావు గురువారం తెలిపారు. జిల్లాలోని మరమగ్గాల(పవర్‌లూమ్స్) కార్మికులు, అనుబంధ రంగాలు డైయింగ్, డిజైనింగ్, వార్పిన్, వైండింగ్, సైజింగ్, వైపని, బ్లీచింగ్, రోలింగ్ (గమ్మింగ్) కార్మికులు అర్హులని వివరించారు. గతంలో 36 నెలలు ఉన్న పథకాన్ని రెండేళ్లకు కుదించారని పేర్కొన్నారు. మరమగ్గాల కార్మికులు నెలకు గరిష్ఠంగా రూ.1,200, అనుబంధ రంగాల కార్మికులు రూ.800 చెల్లిస్తే అంతే మొత్తంలో ప్రభుత్వం జమచేస్తుందని తెలిపారు. మొత్తం డబ్బును వడ్డీతో సహా కలిపి కార్మికులకు 24 నెలల తర్వాత వస్తాయని వివరించారు. జూన్ 9 నుంచి 19 వరకు ఈ పథకంలో చేరేందుకు అవకాశం ఉందన్నారు.

'సీఎమ్మార్'లో వేగం

- రికార్డుస్థాయిలో బియ్యం డెలివరీ
- ముందంజలో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలు
- జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో నత్తనడకన సాగిన వైనం



సాక్షి, పెద్దపల్లి: రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్(సీఎమ్మార్- మరఆడించి) చేసి బియ్యంగా ఇవ్వడంలో జాప్యం చేస్తూ వచ్చిన రైస్‌మిల్లర్లు.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో దిగొస్తున్నారు. సీఎమ్మార్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గ్యారెంటీబాండ్‌లు ఇచ్చిన వారికే ధాన్యం కేటాయిస్తుండడంతో మిల్లర్లు దారికొస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం ఇటీవల సన్నబియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తుండడంతో రీసైక్లింగ్ దందాకు చెక్‌పెట్టినట్లు అయ్యింది. దీంతో పెద్దపల్లి జిల్లా 90శాతంతో రాష్ట్రంలో రెండోస్థానంలో ఉండగా, కరీంనగర్ నాలుగో స్థానంలో నిలిచాయి. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు సీఎమ్మార్ డెలివరీ చేయడంలో వెనకబడ్డాయి.

బ్యాంక్ గ్యారెంటీ షరతు

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ ప్రభుత్వం మిల్లర్లకు ఇస్తోంది. మిల్లర్లు క్వింటాల్ వడ్లు తీసుకుంటే 68 కిలోల బాయిల్డ్ రైస్, 67 కిలోల రా రైస్ ప్రభుత్వానికి అప్పగించాలి. రాష్ట్రంలో అవసరమైన రేషన్‌బియ్యం కోటా తీసుకొని మిగిలిన బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి అప్పగించాలి. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు ఇప్పటిదాకా బియ్యం అప్పగించకుండానే విక్రయించి ఆ డబ్బుతో వ్యాపారాలు చేసుకునేవారు. రూ.కోట్ల విలువైన ధాన్యం రైస్‌మిల్లర్లకు వరంగా మారినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టడం, కేసులు నమోదు చేయడంతోపాటు ఆస్తుల జప్తునకూ వెనకాడడం లేదు. సర్కారు ధాన్యాన్ని ఇప్పటికే విక్రయించిన మిల్లర్లు ఇప్పుడు బయట వడ్లు సేకరించి మిల్లింగ్ చేసి సర్కారుకు బియ్యం ఇస్తున్నారు. దీంతో సీఎమ్మార్ డెలివరీ వేగవంతమైంది.

రికార్డు నమోదు

రైస్‌మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యం ప్రకారం సీఎమ్మార్‌ను త్వరగా పూర్తిచేయాలి. ప్రస్తుత చర్యలతో గత వానాకాలం సీఎమ్మార్‌ను వేగంగా సేకరించగలిగాం. రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా రెండోస్థానంలో ఉంది.

– శ్రీకాంత్‌రెడ్డి, డీఎం, జిల్లా పౌర సరఫరాలు, పెద్దపల్లి

2024-25 వానాకాలం సీజన్ సీఎమ్మార్(మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	ఇచ్చిన ధాన్యం	ఇవ్వాల్సినబియ్యం	ఇచ్చింది	శాతం
పెద్దపల్లి	2,97,379	1,99,750	1,80,487	90
కరీంనగర్	2,60,679	1,75,589	1,43,946	82
జగిత్యాల	3,08,271	2,08,277	1,19,642	57
సిరిసిల్ల	2,11,572	1,42,327	61,364	43

నేటి నుంచి అధ్యయనోత్సవాలు

- 17న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం

వేములవాడ: రాజన్న ఆలయ అనుబంధ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 17 వరకు అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 11.55 గంటలకు రుక్మిణి సమేత సత్యభామ వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 55 ఏళ్ల వయసుగల వ్యక్తి చనిపోయి ఉన్నాడన్న స్థానికుల సమాచారంతో ఎస్సై నరేశ్‌కుమార్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి, వినయ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ముత్యంపేట కారోబార్ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

భూవివాదంలో రైతు ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్

కరీంనగర్‌రూరల్: భూ వివాదంలో ఓ రైతు సెల్ఫీ వీడియో తీసుకుని క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడి కథనం మేరకు.. ఆరెపల్లికి చెందిన రైతు వీణవంక రమేశ్‌కు కరీంనగర్ మండలం నగునూరులో వారసత్వంగా వచ్చిన 2.20 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. కొందరువ్యక్తులు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించుకుని మోఖాపైకి వస్తే చంపుతామంటూ రమేశ్‌ను బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈనెల 10న నగునూరులోని భూమి వద్దకు వెళ్లిన రమేశ్ సెల్ఫీవీడియో తీసుకుని తాను క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్టేటస్ పెట్టుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు రమేశ్‌ను చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భార్య కిడ్నీ ఇచ్చినా దక్కని ప్రాణం


మల్లేశం(ఫైల్)

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలం సంగెంకు చెందిన వంగ మల్లేశం(50) కిడ్నీ మార్చిన మరుసటి రోజే మృతి చెందాడు. మల్లేశంకు ఐదేళ్ల క్రితం రెండు కిడ్నీలు పాడయ్యాయి. అప్పటి నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం ఆయన భార్య లక్ష్మి కిడ్నీని మల్లేశంకు అమర్చారు. బుధవారం ఆసుపత్రిలోనే మృతి చెందాడు. మల్లేశం మృతితో కుటుంబంలో విషాదం నిండింది.

ఏసీబీ రాడార్‌లో మరికొందరు ఇంజినీర్లు!

- కాళేశ్వరం అడిషనల్ టీఎంసీ ప్రాజెక్టు ఇంజినీర్ నివాసాల్లో సోదాలు
- భారీగా అక్రమాలకు పాల్పడ్డాడని ఏసీబీకి వరుస ఫిర్యాదులు
- రెస్టారెంట్లు, విల్లాలు, ఖరీదైన కార్లు కొన్నట్లు గుర్తించిన ఏసీబీ


బుధవారం చొప్పదండి నవోదయలోని ఇరిగేషన్ ఆఫీస్‌లో విచారణ జరుపుతున్న ఏసీబీ అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లపై ఏసీబీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు చేసిన ఇరిగేషన్ అధికారి నూనె శ్రీధర్ కాళేశ్వరంలో భాగమైన అదనపు టీఎంసీ పనుల్లో ఇరిగేషన్ క్యాడ్ డివిజన్– 8 ఈఈగా పనిచేస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనపై దాడులు జరిగాయి. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ఈ దాడులు ఒక్కరితో ఆగేలా లేవు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మరింత మంది ఇంజినీర్లపై ఏసీబీ దాడులు జరపనుంది. ఈ డివిజన్లో పనిచేసే పలువురు ఇంజినీర్లు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఇటీవల ఏసీబీకి వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ డివిజన్‌లో మొత్తం నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక డీఈఈ, అతనికి సహాయకంగా ఐదుగురు జేఈఈలు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు ఆదాయానికి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో దీంతో కొన్ని రోజులుగా ఏసీబీ వీరి ప్రతీ కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టింది. డివిజన్‌లో పనిచేస్తున్న ప్రతీ సిబ్బందిది ఆస్తి పాస్తులు, వారు ప్రాజెక్టులో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఆస్తులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించినట్లు సమాచారం. ఇందులో కొందరు ఆస్తుల్లో గణనీయమైన ఎదుగుదల ఉన్నట్లు తెలిసింది. ఈ డివిజన్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు హైదరాబాద్, బెంగళూరుల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అనుమానిస్తోంది. కొన్నిచోట్ల విల్లాలు, రెస్టారెంట్లు, ఖరీదైన కార్లు కొన్నట్లు గుర్తించింది. కొంతకాలంగా వీరి ఇళ్లల్లో జరిగిన వివాహ, ఇతర వేడుకలకు భారీగా వెచ్చించడాన్ని కూడా ఏసీబీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. బుధవారం ఏసీబీ అధికారులు పలు రెస్టారెంట్లలో సోదాలు చేయడమే ఈ డివిజన్‌లో పనిచేసే సిబ్బందికి ఆయా రెస్టారెంట్లలో వాటాలు ఉన్నాయన్న ఖచ్చితమైన సమాచారానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో త్వరలోనే మరింత మంది అధికారులపై ఏసీబీ దాడులు చేయనున్నట్లు సమాచారం ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి డివిజన్‌లో పనిచేస్తున్న చాలామంది అధికారులకు స్థానచలనం కలగలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లోనూ రాష్ట్రమంతటా ట్రాన్స్‌ఫర్లు జరిగినా.. వీరికి ప్రత్యేక మినహాయింపు రావడం వెనక భారీ లాబీయింగ్ జరిగిందని ప్రచారం సాగుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టులో ఇటీవల విచారణ కమిషన్ క్రిమినల్ కేసు నమోదు చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఫారసు చేసిన ఇద్దరు సీనియర్ ఇంజినీర్లు కూడా గతంలో ఇదే అదనపు టీఎంసీ ప్రాజెక్టులో పనిచేసిన వారే కావడం గమనార్హం.

సంతానం కోసం వెళ్తే ప్రాణమే పోయింది

- ఆపరేషన్ వికటించి మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన


మృతిచెందిన మహిళ రాజవ్వ


ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

జగిత్యాలక్రైం: ఆమెకు సుమారు 18 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. సంతానం లేకపోవడంతో పూజలు చేసింది. దేవుళ్లకు మొక్కింది. పలు ఆస్పత్రుల్లోనూ చూపించుకుంది. అయినా పిల్లలు కలగలేదు. చివరి ప్రయత్నంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించగా.. వారు ఆపరేషన్ చేయించుకుంటే పిల్లలు పుడుతారని చెప్పడంతో అమ్మతనం కోసం అంగీకరించింది. అయితే ఆ అమ్మతనం పొందకుండానే సదరు ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేస్తున్న సమయంలో మృతిచెందింది. ఈ సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. సారంగాపూర్ మండలం పోచంపేట గ్రామానికి చెందిన అయిత గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన రాజవ్వతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కాకపోవడంతో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలికి చూపించుకుంది. వైద్యురాలు గర్భసంచి ఆపరేషన్ చేస్తే పిల్లలు పుడతారని చెప్పడంతో ఆస్పత్రిలో చేరింది. ఆపరేషన్ చేస్తుండానే మృతిచెందింది. ఆమె మృతికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై గీత ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

పోచంపేటలో విషాదం

రాజవ్వ మృతిచెందడంతో ఆమె గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. భర్త గంగాధర్ వ్యవసాయం చేస్తుండగా.. రాజవ్వ బీడీలు చుడుతోంది. దంపతులిద్దరూ అన్యోన్యంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కోసం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా నిండు ప్రాణం పోవడంతో గ్రామంలో విషాదం నిండింది.

మిడ్‌మానేరు ప్రాజెక్టు పరిశీలన

- జిల్లాలో ముగిసిన కేంద్ర బృందం పర్యటన


మిడ్‌మానేరు ప్రాజెక్టు వద్ద కేంద్ర బృందం

బోయినపల్లి(చొప్పదండి): మిడ్ మానేర్ ప్రాజెక్టును కేంద్ర బృందం అధికారులు గురువారం పరిశీలించారు. సెంట్రల్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ జాయింట్ సెక్రటరీ సెంతల్ రాజన్ ఆధ్వర్యంలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సైంటిస్ట్ సుధీర్ కుమార్, కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ ఈఈ ధీరజ్ సింఘాల్ పరిశీలించారు. వరదకాలువ నిర్మాణంలో కేంద్ర నిధుల వినియోగంపై తెలుసుకున్నారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నీటి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలు.. ప్రాజెక్టు నుంచి ఏయే ప్రాంతాలకు నీళ్లు తరలిస్తారనే విషయం తెలుసుకున్నారు. ప్రాజెక్టు కింద ఆయకట్టు వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఈఈ జగన్, డీఈలు రాజు, శ్రీనివాస్, ఏఈలు రాధిక, అనుపమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పంటలు పండుతున్నాయి

ఇల్లంతకుంట(మానకొండూర్): వరదకాల్వ పూర్తయిన తర్వాత మూడు పంటలు పండిస్తున్నామని మండలంలోని గాలిపల్లి రైతులు కేంద్ర బృందం అధికారులకు తెలిపారు. రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందం అధికారులు గురువారం మండలంలోని పాత్తూరు మానేరువాగుపై నిర్మించిన మిడ్‌మానేరు కుడికాలువ దాని డిస్ట్రిబ్యూటరీ కాలువలను గురువారం పరిశీలించారు. గాలిపల్లిలో డిస్ట్రిబ్యూటరీ–4 వద్ద రైతుల నుంచి పంటల సాగు వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో పర్యటన ముగిసిందని, సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్ ప్రాజెక్టు పరిశీలించనున్నట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ ఈఈ ధీరజ్‌సింగాల్, గ్రౌండ్ వాటర్‌బోర్డ్ సైంటిస్ట్ ఎం.సుధీర్‌కుమార్, జిల్లా ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ జగన్, డిప్యూటీ ఇంజినీర్లు శ్రీనివాస్, అంజయ్య, రాజు, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతీయ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి ఒలింపియాడ్ పోటీల్లో బంగారు పతకాలు, నగదు ప్రోత్సాహకం అందుకున్నారని సంస్థ చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అల్ఫోర్స్ స్కూల్‌లో గురువారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో రసగ్న (9వ తరగతి) బంగారు పతకం, కంప్యూటర్ ఒలింపియాడ్‌లో హేమంత్ జాదవ్ (10వతరగతి) బంగారు పతకం, హిందీలో ఎ.శ్రీయాన్‌రెడ్డి (4వ తరగతి), యు.సాత్రివ్ (6వ తరగతి), ఇ.లిఖిత్ కుమార్ (8వ తరగతి), పి.నమన్విత (10వ తరగతి) బంగారు పతకాలు, సోషల్ ఒలింపియాడ్‌లో హఫీజ్‌రెడ్డి (6వ తరగతి), యం.శివేన్ రెడ్డి (8వ తరగతి) బంగారు పతకాలు, సోషల్ ఒలింపియాడ్‌లో ఎ.యశ్‌చంద్ర (9వ తరగతి)స్టేట్ టాపర్‌గా, నేషనల్ ఎస్సే ఒలింపియాడ్‌లో బి.తన్మయి (7వ తరగతి) స్టేట్‌ర్యాంక్, ఇంటర్నేషనల్ డ్రాయింగ్‌లో ముగ్ధా హాసిని (10వ తరగతి) స్టేట్ ర్యాంక్, సోషల్‌లో ఎ.శ్రీయాన్ రెడ్డి (4వ తరగతి) స్టేట్ ర్యాంక్‌లు సాధించడం హర్షణీయమన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి

- కేసు నమోదు


తలకు గాయమైన కసుబోజుల వెంకన్న

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడిపై అదే పార్టీకి చెందిన ఓ నాయకుడు దాడిచేశాడని టౌన్ సీఐ ఎస్.రామకృష్ణ గురువారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొత్తపల్లిలోని కసుబోజుల వెంకన్న ఇంటికి బుధవారం రాత్రి వెళ్లిన దేశిని కోటేశ్వర్(కోటి) రాబోయే ఎన్నికల్లో తనకు సపోర్టు చేయాలని బెదిరిస్తూ కర్రతో తలపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన అతని భార్యపై సైతం దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తరగతి గదుల్లోనే దేశభవిష్యత్

- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య


పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, డీఈవో మాధవి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): దేశభవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలిరోజు గురువారం ఎమ్మెల్సీ స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు జాతీయతభావం, దేశభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చాలని, అందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశానని గుర్తుచేశారు. డీఈవో మాధవి, ఎంఈవో మహేశ్ కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషితో బడిబాట ద్వారా మండలస్థాయిలో మొత్తం 250 మంది విద్యార్థులను ప్రవేశాలు కల్పించామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత, పీఎస్ హెచ్‌ఎం రాజారాం, మాజీ ఎంపీటీసీ గూడెపు జనార్దన్‌రెడ్డి, నాయకులు కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, చిలువేరు సదాశివ, రఫీ, గరిడె కిషన్, ముల్కోజు వెంకన్న, తిరుపతి, సీను తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్- తిరుపతికి ప్రత్యేక రైలు

కరీంనగర్‌రూరల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జూలై నెలలో కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడిపించేందుకు దక్షిణమధ్య రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. జూలై 6నుంచి 27వరకు రైలు నంబరు 02761 తిరుపతి నుంచి కరీంనగర్‌కు 4 ట్రిప్పులు, 7 జూలై నుంచి 28 వరకు రైలు నంబరు 02762 కరీంనగర్ నుంచి తిరుపతికి 4 ట్రిప్పులు నడిపించనున్నారు. ప్రతీ ఆదివారం తిరుపతి నుంచి ప్రత్యేక రైలు బయల్దేరి సోమవారం కరీంనగర్‌కు చేరుకుంటుంది. కరీంనగర్ నుంచి తిరుపతికి తిరిగి బయల్దేరుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నెలరోజుల పాటు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని కరీంనగర్‌స్టేషన్ మేనేజరు రవీందర్ తెలిపారు. రెగ్యులర్‌గా కరీంనగర్ నుంచి ప్రతి గు రు, ఆదివారాల్లో తిరుపతికి నడిచే రైలుకు అదనంగా ఈ ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు వివరించారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.86.85 లక్షలు



వేములవాడ: రాజన్నకు 15 రోజుల్లోనే హుండీల ద్వారా రూ.86,85,307 నగదుతోపాటు 83 గ్రాముల బంగారం, 5.500 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. ఓపెన్‌స్లాబ్‌లో గురువారం కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల మధ్య హుండీలోని డబ్బులను ఆలయ అధికారులు, సిబ్బంది, రాజరాజేశ్వర సేవ సమితికి చెందిన 570 మంది లెక్కించారు. ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఎస్పీఎఫ్, భద్రత సిబ్బంది పర్యవేక్షించారు.

శాతవాహనలో ఎంఫార్మసీ కోర్సుకు ఆమోదం

- 45 సీట్లకు అనుమతి

కరీంనగర్‌టౌన్: శాతవాహన విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఎంఫార్మసీ కోర్సును ప్రారంభించడానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి యు.ఉమేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేరుడ్యాం పక్కన ఉన్న ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఎంఫార్మసీ కోర్సును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఫార్మకాలజీ, ఫార్మాసిటిక్స్, ఫార్మసిటికల్ అనాలసిస్ విభాగాల్లో 15 సీట్ల చొప్పున మొత్తం 45 సీట్లకు అడ్మిషన్లకు అనుమతి లభించిందన్నారు. ఇదే కళాశాలలో ఫార్మసీ విద్యను అభ్యసించిన వారికి పీజీ ఇక్కడే చదువుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్ వీసీ ఉమేశ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


తనిఖీ చేస్తున్న ఏవో ప్రియదర్శిని, ఎస్సై మోతీరాం

రుద్రంగి(వేములవాడ): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ప్రియదర్శిని, ఎస్సై మోతీరాంనాయక్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఫర్టిలైజర్ షాపులను టాస్క్‌ఫోర్స్ టీం ఆకస్మిక తనిఖీ చేశారు. ధరలు, విత్తనాల నిల్వ, అమ్మకపు వివరాల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ రైతుకు విక్రయపు రసీదు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తంగళ్లపల్లి ఏవో సంజీవ్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఐఏయూవైఎస్ఏ ఆవిర్భావ వేడుకలు


వెంకటాపూర్‌లో ఆవిర్భావ వేడుకలకు హాజరైన యువత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారు ఓమౌజయ ఆశ్రమంలో ఇంటర్నేషనల్ ఓమౌజయ యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్(ఐఏయూవైఎస్ఏ) స్వచ్ఛంద సేవాసంస్థ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు తరలివచ్చారు. ఆరు రోజుల పాటు యువతకు ఆవిర్భావం సందర్భంగా క్రికెట్, చెస్, కోకో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు మ్యాస్త్రో, అధ్యక్షులు తిరుమల రుషి, సభ్యులు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

సకాలంలో ఇళ్లు పూర్తి చేయాలి


ఎల్లారెడ్డిపేటలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇసుక, ఇతర సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, నాయకులు నంది కిషన్, అంతర్పుల గోపాల్, ద్యాగ లక్ష్మీనారాయణ, ఎడ్ల రాజుకుమార్, గుర్రపు రాములు, పందిర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: కార్మికుల కనీస వేతన సవరణ జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) రాష్ట్ర అధ్యక్షుడు కలల్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద కార్మికులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోటి యాభై లక్షల మంది కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ జీవోలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇక్కడ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రవీందర్‌రెడ్డి, కార్యదర్శి కొండల్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ పొన్న మేఘన, కోకన్వీనర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): జూలై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి కోరారు. కోనరావుపేటలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో గురువారం సమావేశమయ్యారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె భూమిపూజ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు ఖానాపూర్ లక్ష్మణ్, మంగళి చంద్రమౌళి, కుమ్మరి రవి, బొడ్డు ప్రభాకర్, బాబు, సురేశ్, తైదల రాజయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, తాండ్రా ప్రతాప్, ఎనగందుల రాజు, మోహన్ ఉన్నారు.

షెడ్ కూల్చివేత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్ వ్యవసాయక్షేత్రంలోని రేకుల షెడ్డును గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మండెపలిలోని సర్వేనంబర్ 374లో 3.25 ఎకరాలను ప్రభుత్వం మూడు నెలల క్రితమే స్వాధీనం చేసుకుందని తహసీల్దార్ జయంత్‌కుమార్ తెలిపారు. అక్రమంగా నిర్మించిన రేకులషెడ్డును కూల్చివేశామన్నారు. సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్ మాట్లాడుతూ అధికారులు నోటీసులు ఇవ్వకుండానే రేకులషెడ్డును కూల్చివేశారని ఆరోపించారు. హైకోర్టు నుంచి స్టే ఉన్నా కూల్చివేయడంపై కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు


టీపీసీసీ అధ్యక్షుడితో సురేశ్

గంభీరావుపేట: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కూర సురేశ్ గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మండలంలోని వివిధ గ్రామాల మున్నూరుకాపు సంఘాల నాయకులు ఉన్నారు.

క్షయపై అవగాహన


దమ్మన్నపేటలో అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యాధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దమ్మన్నపేటలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు, పొగాకు తీసుకునే వారిలో క్షయవ్యాధి లక్షణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో రమేశ్, టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు

వేములవాడ: పాతకక్షలతో దాడిచేసి గాయపరిచిన కేసులో కట్ట గంగరాజుకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.400 జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్‌కుమార్‌జాదవ్ గురువారం తీర్పునిచ్చినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బోయినపల్లి మండలం తడగొండకు చెందిన వేముల సాయితరుణ్(19) దసరా పండుగను పురస్కరించుకొని 2020 అక్టోబర్ 25న గ్రామంలోని వేంకటేశ్వరగుడి వద్ద ఏర్పాటు చేసిన జమ్మిని చూసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన కట్ట గంగరాజు పాతకక్షలు మనసులో పెట్టుకుని సాయితరుణ్‌పై సిమెంట్ ఇటుకతో దాడి చేశాడు. బాధితుడి తల్లి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా గంగరాజుపై హత్యాయత్నం కేసు నమోదైంది. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి గంగరాజుకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.400 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.